ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 3 సెప్టెంబరు 2024



నిండుకుండల్లా..



సిరిసిల్ల మానేరు వాగు ఉధృతి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం ఉదయం వరకు 75.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లలో)
ఎల్లారెడ్డిపేట	119.0
గంభీరావుపేట	106.7
రుద్రంగి	105.5
చందుర్తి	86.8
వేములవాడ రూరల్	33.8
బోయినపల్లి	57.9
వేములవాడ	60.4
సిరిసిల్ల	47.7
కోనరావుపేట	67.9
వీర్నపల్లి	71.6
ముస్తాబాద్	85.6
తంగళ్లపల్లి	80.8
ఇల్లంతకుంట	57.5

జిల్లాలో ఈ సీజన్‌లో 575.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి 786.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

చందుర్తి మండలం మర్రిగడ్డలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- **కూలిన ఇళ్లు.. దెబ్బతిన్న రోడ్లు**

రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లాలోని చందుర్తి, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. దెబ్బతిన్న ఇళ్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గంలో పరిశీలించారు. ఇల్లంతకుంట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ నష్టాన్ని పరిశీలించారు. ఎగువ మానేరు ప్రాజెక్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. సందర్శకులను అనుమతించవద్దని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల వద్ద ఉన్న నీటిని తొలగించాలని ఆదేశించారు.

- మిడ్ మానేరులోకి చేరుతున్న వరద నీరు
- మత్తడి మీదుగా ఎగువమానేరు పరవళ్లు
- పొంగిపొర్లుతున్న మానేరు, మూలవాగు
- జిల్లాలో 75.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం
- ఉదయం గెరువిచ్చినా.. సాయంత్రం మళ్లీ ప్రారంభమైన వాన

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండగా, ఎగువ మానేరు మత్తడి మీదుగా పరవళ్లు తొక్కుతోంది. సిరిసిల్ల మానేరువాగు, వేములవాడలోని మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతుండడంతో మత్తడి దూకుతున్నాయి. సోమవారం ఉదయం వరకు ఎడతెరిపి లేని వర్షంతో జనం జీవనం స్తంభించింది. వర్షం కొంత గెరువివ్వడంతో ప్రజలు పనులవైపు దృష్టి సారించారు. రైతులు పొలాల్లో నిలిచిన నీళ్లను తొలగించి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. మళ్లీ సోమవారం రాత్రి వర్షం కురిసింది. మరోవైపు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటమునిగి రైతులు ఆవేదన చెందుతున్నారు. అక్కడక్కడ కూలిన ఇళ్లతో పలు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వారికి పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించారు. జిల్లాలో పలు మండలాల్లో కల్వర్టులు, రోడ్లు దెబ్బతినడం, వరద ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం గెరువివ్వడంతో ప్రజలు పనులపై దృష్టి సారించారు. రైతులు పంట పొలాల్లో నిలిచిన నీళ్లను తొలగించి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. జిల్లాలో కూలిన ఇళ్లు, వరద ప్రాంతాలను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

- **జిల్లాలో 138 చెరువుల్లోకి భారీగా వరదనీరు**

జిల్లాలో 656 చెరువులు ఉండగా 138 చెరువుల్లోకి భారీగా వరదనీరు చేరి మత్తడి దూకుతున్నాయి. 60 చెరువుల్లోకి 25 శాతం, 53 చెరువుల్లోకి 25 నుంచి 50 శాతం, 78 చెరువుల్లోకి 50నుంచి 75 శాతం, 310 చెరువుల్లోకి 75 నుంచి వంద శాతం నీరు చేరింది. జిల్లాలోని శ్రీ రాజారాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 45,438 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. మానేరు, మూలవాగుల నుంచి 39,288 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా దిగువకు 6,550 క్యూసెక్కుల నీటిని వదిలారు.

- **నీట మునిగిన పంట పంటలు**

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షానికి పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లోకి నీరు చేరింది. వీర్నపల్లి మండలం శాంతినగర్, గర్జనపల్లిలో వంద ఎకరాల్లో పంట మునిగిపోయింది. గర్జనపల్లిలో భానోతు స్వరూపకు చెందిన రెండెకరాల వరి పూర్తిగా కొట్టుకుపోయింది. ఇల్లంతకుంటలో 60 ఎకరాల్లో వరి, 40 ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. వేములవాడ మండలం నాంపల్లిలో 20 ఎకరాల వరి చేను నీట మునిగింది. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెలో 30 ఎకరాల్లో వరి, ఎల్లారెడ్డిపేట మండలంలో 150 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో పత్తి, కోనరావుపేట, మండలంలో 19 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి.



మత్తడి దూకుతున్న ఎగువ మానేరు



ఎగువ మానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఇల్లంతకుంట మండలం పత్తికుంటలో మత్తడి దూకుతున్న చెరువు



చందుర్తి మండలం సనుగులలో కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేటలో పత్తి చేనులో వేసిన ఇసుక మేట



వేములవాడ మూలవాగు ప్రవాహం

జిల్లా పంచాయతీ అధికారి బదిలీ

సిరిసిల్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను బదిలీ చేస్తూ సోమవారం పంచాయతీరాజ్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. వీరబుచ్చయ్య పెద్దపల్లి డీపీవోగా బదిలీ అయ్యారు.

లభించని మత్స్యకార్మికుడి ఆచూకీ

గంభీరావుపేట, సెప్టెంబరు 2: మండలం నర్మలా ఎగువ మానేరులో గల్లంతైన శివరాములు అనే మత్స్య కార్మికుడి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చ పేటకు చెందిన మత్స్య కార్మికుడు శివరాములు ఎగువ మానే రుకు అతి సమీపంలోని వాగులోకి చేపలు పట్టేందుకు ఆదివారం ఉదయం వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వాగు వద్దకు వెళ్లి వెతికారు. వాగు ఒడ్డున శివ రాములు దుస్తులు, చెప్పులు కనించాయి. చేపలు పట్టేందుకు వెళ్లి శివరాములు గల్లంతయి నట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం, సోమవారం సాయంత్రం వరకు శివరాములు కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

వేములవాడ టౌన్/చందుర్తి, సెప్టెంబరు 2: వరద ఉధృతితో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం చందుర్తి మండలం మర్రిగడ్డలో వర్షంతో ఇళ్లు కోల్పోయిన నేరెళ్ల సరోజన, మల్యాల రాజేశంను పరామర్శించారు. కట్టలింగం పేటలో గురునాథపు చెరువు అలుగు దూకడంతో వచ్చే వరద నీటిని, సనుగుల శివారులో కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ స్తంభాలను, వైర్లను, పరికరాలను తాకవద్దని సూచించారు. చెరువులు కుంటల వద్దకు వెళ్లవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పురా తన మైన ఇళ్ల ఉన్నవారు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలన్నారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్,



వరద నీటిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

పొద్దుపొడుపు లింగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, దూది శ్రీనివాస్ రెడ్డి, బండారి శేఖర్, భీమ రాజు కనకరాజు, ముస్కు ముకుందరెడ్డి, మల్లేశం, రవీందర్ రెడ్డి, సంటి ఏసుదాసు, మధు, అనిల్, శ్రీని వాస్, అంజన్ రావు, రమేష్, జలపతి, అజయ్ ఉన్నారు.

- నిస్సహాయకులకు సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి నిరాశ్రాయురాలుగా మిగిలిన గసికంటి ఎల్లవ్వకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి రూ.50 వేల చెక్కును సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు ఇల్లు కూలి పోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించామన్నారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా ఆర్థిక సహాయం అంద జేస్తూ మేమున్నామని భరోసా కల్పిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 2: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.07 టీఎంసీలకు నీరు చేరింది. మధ్యమానేరు నుంచి 6,400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 2: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల పట్టణంలోని 17వ వార్డులో తెలంగాణ సాంస్కృతిక కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళా బృందం సారథి ఎడమల శ్రీధర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, కళాకారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

సిరిసిల్ల టౌన్ సెప్టెంబరు 2: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.వసంతరావు ఆదేశాలతో సోమవారం జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులను అధికారులు తనిఖీ చేశారు. వేములవాడ పట్టణంలోని విహాన దంత వైద్యశాల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని తనిఖీల్లో బయట పడింది. అనుమతులు లేకుండా దంత వైద్యశాల నడుపుతున్న యాజమాన్యానికి జరిమానా విధించారు. అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉపాధికారి డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ అంజలి ఉన్నారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఏంజెల సోమవారం తనిఖీలు చేశారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని అన్నారు. లింగ నిర్ధారణ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. హెచ్ ఈ బాలయ్య, సీహెచ్‌వో బాలచందర్ ఉన్నారు.

రాజన్న ఆలయానికి అమావాస్య ఎఫెక్ట్



వెలవెల బోతున్న రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 2 : శ్రావణ మాసం చివరి సోమవారం రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావాల్సి ఉండగా అమావాస్య కావడంతో ఆలయం ఉదయం వెలవెలబోయింది. మధ్యాహ్నం వర్షం తగ్గిన తరువాత కొద్ది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ సోమవారం సందర్భంగా రాజన్న ఆలయంలో ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆలయ మండపంలో సాయంత్రం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు.

సమస్యలుంటే సమాచారం ఇవ్వండి

వీర్నపల్లి, సెప్టెంబరు 2: భారీ వర్షాలకు మారుమూల అటవీ తండాల్లో ప్రజలకు ఇబ్బందికర సమస్యలు ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. వీర్నపల్లి మండలం రంగంపేట జంపన్న చెరువు, గర్జనపల్లిలో మూలవాగు, కొత్తచెరువు మత్తడి, వట్టి వాగుల వరద ఉధృతిని సోమవారం పరిశీలించారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రపత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థ ఇండ్లలో ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వర్షానికి పంట నష్టం వాటిల్లితే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆర్డీవో రమేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ ఎల్లాగౌడ్, అధికారులు ఉన్నారు.

- గర్జనపల్లి గ్రామంలో వర్షానికి కూలిన మల్యాల పూజిత ఇల్లును పరిశీలించేందుకు వెళ్లిన కలెక్టర్‌కు తన బిడ్డ అనారోగ్యంతో బాధపడుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జిల్లా వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి చిన్నారి ఆరోగ్య సమస్యను తెలుసుకోవాలని, నివేదిక పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడి నుంచి వెళ్తుండగా దోమకొండ లహరి మూగ, అంధకారంతో బాధపడుతూ పదో తరగతి వరకు చదివిందని, ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో ఉన్నత చదువులు చదవలేక పోతున్నదని కాంగ్రెస్ నాయకులు రాకేష్ గౌడ్ ఆమె దీనస్థితిని కలెక్టర్‌కు వివరించారు. ఆమె పరిస్థితిని గమనించిన కలెక్టర్ కుటుంబ వివరాలు తెలుసుకొని లహరి ఉన్నత చదువులకు కావాల్సిన



గర్జనపల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఏర్పాట్లు చేసి నివేదిక పంపించాలని తహసీల్దార్ మారుతిరెడ్డిని ఆదేశించారు. గర్జనపల్లిలో చాలా మంది వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గమనించిన కలెక్టర్ గ్రామంలో తాగునీటి పరీక్ష చేసేందుకు అధికారులను పంపిస్తామన్నారు. చాలామంది చిన్నారులకు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నాయని స్థానికులు వివరించారు.

- **ఎగువ మానేరును పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మల ఎగువ మానేరు జలాశయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో సందర్శకులను అనుమతించ వద్దని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు లింగన్నపేట బ్రిడ్జి వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. సిరిసిల్ల ఆర్డీవో రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, తహసీల్దార్లు భూపతి పాల్గొన్నారు.



రూ.53 లక్షలకు ఇసుక వేలం

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 2: జమ్మికుంట మండలం శంభునపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పరిమల కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 1500 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను అదే గ్రామానికి చెందిన ఎస్ రమేష్ అనే వ్యక్తి బహిరంగ వేలం ద్వారా రూ.53లక్షలకు సోమవారం దక్కించుకున్నాడు. వేలంలో రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.







గొల్ల, కురుమలకు సబ్సిడీ రుణాలు అందజేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్

భగత్‌నగర్, సెప్టెంబరు 2: ప్రభుత్వం గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గొర్రెకాపరుల సహకార సంఘ సొసైటీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేయలన్నారు. స్వర్గీయ కాలువ నర్సన్న యాదవ్ ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. ప్రమాదవశాత్తు పిడుగుపాటు, పాముకాటుతో చనిపోయిన వారికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. గొర్రెల కాపరులకు ఫారెస్ట్ అధికారుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్నయాదవ్, రాష్ట్ర కార్యదర్శి కదారి ఐలయ్య, చిగుర్ల శ్రీనివాస్, నందనవేని ప్రసాద్, జంగం కొమురన్న, గూడెం శ్రీనివాస్ రాజు, దాడి రాజబాబు, గంగంలింగయ్య, రాధారపు కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయన్నారు. చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమై కాలనీలు నీట మునిగాయన్నారు. ఇసుక మేటలతో పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు.ఇళ్లు కూలిపోయిన వారిని వెంటనే ఆదుకోవాలన్నారు. కరీంనగర్‌లో హైడ్రా తరహాలో సంస్థను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు నరేష్‌పటేల్, నాయకులు పున్నం రవి, చెలకాని శ్రీనివాస్, ఎం.ప్రశాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి



విజేతగా నిలిచిన రామగుండం ఎన్టీపీసీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

బ్యాడ్మింటన్ విజేత
రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, సెప్టెంబరు 2 : కర్నాటకలోని కుడిగి ఎన్టీపీసీలో జరిగిన ఇంటర్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ 2024లో రామగుండం ప్రాజెక్టు జట్టు బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో రామగుండం ఎన్టీపీసీ ఆటగాళ్లు సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. హరీష్‌కుమార్ నాయకత్వంలోని రామగుండం ఎన్టీపీసీ జట్టు సభ్యులు రాంబాబు, రాజేశ్, శోభన్‌బాబు, సోహన్ సింగ్, వీరబాబు, టీం మేనేజర్ జి.భానేశ్వర్, కోఆర్డినేటర్ లను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడు అభినందించారు.







ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,51,250	3,30,781	80.5	73.00
ఎల్లంపల్లి	2,78.326	4.02.023	20.175	14.181
మిడ్ మానేరు	46,272	6.400	27.54	19.55
ఎల్ఎండీ	9.718	273	24.034	15.788
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

కోరుట్ల, సెప్టెంబరు 2 : కోరుట్ల పట్టణానికి చెందిన రియల్టర్‌ను బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడ్డ అయిలాపూర్ గ్రామానికి చెందిన సుందరగిరి లక్ష్మీనర్సయ్యగా అనే వ్యక్తిని కోరుట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరెస్టు వివరాలను ఎస్ఐ శ్రీకాంత్‌తో కలిసి వెల్లడించాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఉంటున్న దాసరి రాజశేఖర్ అలియాస్ టీవీ శేఖర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారికి లక్ష్మీనర్సయ్య ఫోన్ చేసి మొదట కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కొద్ది రోజులకు ప్రకాశం రోడ్డులోని రాజశేఖర్ టీవీ సర్వీసింగ్ సెంటర్‌కు వచ్చిన సదరు వ్యక్తి రూ. 10లక్షలు ఇవ్వాలని లేకుంటే చంపుతానని బెదిరించాడు. దీంతో వెంటనే రాజశేఖర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో ఆ ప్రాంతంలో నిఘా ఉంచాడు. ఆదివారం సాయంత్రం మరో మారు రాజశేఖర్ వద్దకు సదురు వ్యక్తి వచ్చిన విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో అక్కడి చేరుకుని మాటు వేసి పట్టుకున్నారు. ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. అతని వద్ద సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం, కత్తి స్వాధీనం చేసుకున్నారు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, కానిస్టేబుళ్లు ఎల్లయ్య, పురిషోత్తం, శ్రీనివాస్‌లను సీఐ అభినందించారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపలు బయటకు వెళ్లకుండా వలలు కట్టడానికి వెళ్లి గోస్కుల కుమార్(45) ఆదివారం గల్లంతయ్యాడు. గాలింపు చర్యలో సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతిచెందిన కుమార్ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామ వాసి. చెరువులో నుంచి చాపలు బయటికి వెళ్లకుండా ముత్తడి వద్ద వలలు కట్టడానికి గోస్కుల కుమార్, కలవేన మొగిలి, సాగర్ల తిరుపతి, చేతి నరసయ్య వెళ్లగా వరద ప్రవాహానికి గోస్కుల కుమార్ గల్లంతయ్యాడు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులను మత్స్య కార్మికులను రెస్క్యూ టీం సభ్యులను అప్రమత్తం చేశారు. ఉదయం నుంచే చెరువులో గాలింపు చేపట్టగా కుమార్ మృతదేహం లభ్యమైంది. కుమార్ మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. బతుకుదెరువు కోసం వచ్చి ప్రాణాలు కోల్పోవడంతో అటు మృతుడి గ్రామం ఇటు కునారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


ఏసీపీ వెంట సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, ఎంపీవో గోవర్దన్, పోలీసులు అధికారులు ఉన్నారు.

తెరుచుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు

- 40 గేట్లు ఎత్తి దిగువకు 2 లక్షల క్యూసెక్కుల నీరు
- వరద కాలువకు 7 వేల క్యూసెక్కులు
- ప్రాజెక్టులోకి 2.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం భారీగా వరద రావడంతో 40 గేట్లు ఎత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో భారీగా కొనసాగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను విడతల వారీగా ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద కాలువకు సైతం 7 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టులోకి 2,51,250 క్యూసెక్కుల ఇన్‌స్టంట్ ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 73 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 40 గేట్లు ఎత్తి 2 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా, కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, వరద కాలువకు 5 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదిలారు.

ఉదయం 6 గంటలకు వరద కాలువకు 1,500 క్యూసెక్కులు విడుదల చేయగా, 7 గంటలకు ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పెరుగుతుండడంతో 3 వేల క్యూసెక్కులు, 10 గంటల నుంచి 5 వేల క్యూసెక్కులకు, సాయంత్రం 4 గంటలకు 7వేల క్యూసెక్కులకు పెంచారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎస్సారెస్పీ, రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



ఎస్సారెస్పీ వద్ద గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు



ఎల్ఎండీ ప్రాజెక్టులో నీరు

ధర్మపురి, కోటిలింగాల వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరి నది వరద సోమవారం సాయంత్రం ఉధృతంగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురి సిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. కడెం ప్రాజెక్టు గేట్లు తెరచి గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణ క్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల సంతోషిమాత, మంగళిగడ్డ, సోమవిహార్ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల పలు గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద గోదావరి ఉధృతి

● వెల్గటూర్: కోటిలింగాల వద్ద సోమవారం వరద ఉధృతి పెరిగింది. స్నాన ఘట్టాలపైకి నీరు చేరింది. తహసీల్దార్ శేఖర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్‌లు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు గోదావరిలోకి వెళ్ల వద్దని హెచ్చరించారు. చేపలు పట్టే వారు చేపల వేటకు వెళ్లవద్దని, పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి భారీగా నీటి విడుదల

అంతర్గాం : అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి గ్రామ శివారులో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు 32గేట్లు ఎత్తి సోమవారం గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నట్టు ఎల్లంపల్లి అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి ఎగువన గల కడెం ప్రాజెక్టు నుంచి 40,250 క్యూసెక్కులు, వాగులు, కుంట ల ద్వారా మొత్తం 2,78,326 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎల్లంపల్లి అధికారులు 32 గేట్లను ఎత్తి 4,02,023క్యూసెక్కుల నీటిని దిగువన గల గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175టీఎంసీలకు ప్రస్తుతం ప్రాజెక్టులోకి 14.181 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇంకా వరద ఉధృతి కొనసాగుతుండగా అధికా రులు మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉన్నది. గేట్లు ఎత్తడంతో గోదావరి తీర ప్రాంతగ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

గాయత్రీ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల నిలిపివేత

● ప్రారంభం నుంచి 205 టీఎంసీల నీరు ఎత్తిపోత

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదలను కొనసాగించిన అధికారులు సోమవారం నిలిపివేశారు. నెలరోజులుగా ఇక్కడి నుంచి మిడ్ మానేరుకు 24.2 టీఎంసీల నీటిని రిజర్వ్ చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు అన్ని జలాశయాలలో నీరు ఉండటంతో నీటి విడుదలను ఆపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు 205 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ఒక్కో టీఎంసీతో పది వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుండగా మొత్తం 20లక్షల50 వేల ఎకరాలకు సాగు నీరు అందించినట్లు అయింది.

మిడ్ మానేరుకు భారీగా వరద

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షాలతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ గణనీయంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి 46,272 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు, వరద కాలువ క్యాచ్‌మెంట్ల ద్వారా 41,271 ఎస్సారెస్పీ నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలను నిలిపివేశారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలకు ఆదివారం సాయంత్రం వరకు 15.30 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉండగా సోమవారం 19.55 టిఎంసిలకు చేరుకుంది.

పెరుగుతున్న ఎల్ఎండి నీటి మట్టం

తిమ్మాపూర్: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉధృతంగా ప్రవహించిన మోయతుమ్మెద వాగు సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఉధృతి కూడా తగ్గింది. ఎల్ఎండిలో ప్రస్తుతానికి 24.034 టీఎంసీలకు 15.754టిఎంసిల నీరు నిల్వ ఉండగా, మోయతుమ్మెద వాగు ద్వారా 7,887క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుండి 1,831క్యూసెక్కులు మొత్తం 9,718 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా 273క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు ఎల్ఎండీ వద్ద ఉండి పర్యవేక్షిస్తున్నారు.

ఉప్పొంగుతున్న మానేరు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు పరవళ్లుతొక్కుతూ పోటెత్తుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సిద్దిపేట జిల్లాలోని కూడవెల్లి వాగు, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తుంటంతో మానేరులోకి వరద నీరు భారీగా వస్తోంది. దీంతో అధికారులు మానేరు వాగు పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. రైతులు, మత్స్యకారులు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నారు.

చికిత్స పొందుతూ ట్రాన్స్‌కో ఫోర్‌మన్ మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 2: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ట్రాన్స్‌కో ఫోర్‌మన్ అజ్మీర సారయ్య(53) సోమవారం మృతి చెందాడని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న అజ్మీర సారయ్య కరీంనగర్ టౌన్-5 టవర్‌సర్కిల్ ప్రాంతంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 30న రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వెళుతుండగా భాగ్యనగర్ అప్పాబజార్ కిరాణంషాపు చౌరస్తా వద్ద గణేష్ మండపం ఏర్పాటు కోసం రోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలిన భారీ ఇనుప బల్లలను బైక్ ఢీకొట్టింది. దీంతో కిందపడిన అజ్మీర్ సారయ్య కాలు, ముఖం, నడుం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా భారీ ఇనుప బల్లలను రోడ్డుపై వదలిన కారణంగా తన తండ్రి ప్రమాదానికి గురై మరణించాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి కొడుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బోవెరాను ఆదర్శంగా తీసుకోవాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 2: ప్రతి ఒక్కరూ డాక్టర్ బోయినపల్లి వెంకటరామారావు(బోవెరా)ను ఆదర్శంగా తీసుకోవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బోవెరాలా పనిచేసే 360 డిగ్రీల యువ నాయకత్వం సమాజానికి కావాలని ఆయన అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపం హాల్-2లో బోవేరా సంస్థల ఆధ్వర్యంలో బోవేరా 104వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బోవెరా విగ్రహానికి పూల మాలలు వేశారు. బోవెరా సంస్థల అధ్యక్షుడు బోయినపల్లి హనుమంతరావు స్వాగతోపన్యాసం చేశారు. గద్దర్‌కు మరణానంతరం గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు గాయకుడు, కవి అందెశ్రీతో పాటు ఇతర అతిథుల చేతుల మీదుగా బోవెరా కవితా పురస్కారాన్ని అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బోవేరా మద్యనిషేధం, గ్రంథాలయోద్యమం, అంటరానితనం నిర్మూలన, వయోజన విద్య, హిందీ భాషా ప్రచారం, భూదాన ఉద్యమాల ద్వారా ప్రజల్ని ప్రభావితం చేశారని అన్నారు. బోవెరా పేరుతో ఆయన స్వగ్రామం తోటపెల్లిలో ఒక కళాక్షేత్రం, స్మారక ఆశ్రమం ఏర్పాటు చేయాలనుకోవడం హనుమంతరావు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సమాజం కోసం జీవితాన్నే త్యాగం చేసిన బోవెరా మన గడ్డపై పుట్టడం గర్వకారణమని అన్నారు. అందెశ్రీ మాట్లాడుతూ బోవెరా విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ తాను ఎంచుకున్న జీవన విధానంలో బోవేరా కృతకృత్యులయ్యారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకుడు పృథ్వీరాజ్ వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, నగర వాసులు, బోవేరా అభిమానులు, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.



గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ దంపతులకు బోవెరా పురస్కారంతో సన్మానం

ప్రమాదవశాత్తు మహిళ మృతి



లక్ష్మి (ఫైల్)

వీర్నపల్లి, సెప్టెంబరు 2 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామ పరిధిలోని లొద్ది తండాలో సోమవారం పాడి గేదె నెట్టడంతో గిరిజన మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోతు లక్ష్మి (52) పాడి గేదెను తాడుతో పట్టుకొని మేత మేపేందుకు వెళ్తోంది. వెనక నుంచి గేదె నెట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పట్టుకున్న తాడు ఆమెకు చుటుకొని కింద పడింది. తలకు, మెడ నరాలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజ్యా, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 2: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నారాయణపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సయ్య తన ఆటోను నడుపుకుంటూ బస్టాండు వైపునకు వెళ్తున్నాడు. గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో నర్సయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిపల్లి బాలికల గురుకులం ఖాళీ

- ● మూడు రోజుల పాటు విద్యార్థులకు సెలవు
- ● శిథిల భవనాలు.. భారీ వర్షాలే కారణం

మల్యాల, సెప్టెంబరు 2: మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులను ఇంటికి పంపించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇక్కడి విద్యార్థులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు సెలవు ప్రకటించారు. దాదాపు నలభై ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ తవ్వకం సందర్భంగా ఏర్పాటు చేసిన సిబ్బంది క్వార్టర్స్‌లో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయగా అప్పటి నుంచి సగంకు పైగా ఆ భవనాలనే కొనసాగిస్తుండడం, మరి కొన్ని భవనాలు శిథిలవస్థకు చేరి కూలే దశకు చేరుకోవడంతో వర్షాలతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యార్థులను ఇంటికి పంపించారు. ప్రస్తుతం పాఠశాలలో 475, కళాశాలలో 171 మంది విద్యనభ్యసిస్తున్నారు. 2018లో కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ భవనాలు నిర్మించకపోవడం, పాత, శిథిల భవనాలలో తరగతులు నిర్వహించడం, చిల్లులు పడిన రేకుల గదులలోనే విద్యార్థులు పడుకోవడం తదితర అనేక సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటు న్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండడంతో ఆది, సోమవారాల్లో విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ విష యమై పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మానసను వివరణ కోరగా శిథిల, పాత భవనాలు సమస్యాత్మకంగా ఉన్న చోట్ల విద్యార్థులను ఇంటికి పంపించాలనే గురుకులాల సొసైటీ అధికారుల సూచన మేరకు విద్యార్థులకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి ఇంటికి పంపించినట్లు తెలిపారు



తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల

ఏఐఎస్ఎఫ్ న్యాయ విద్య విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా బాలసాని లెనిన్

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 2: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బాలసాని లెనిన్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర న్యాయ విద్య విభాగం కన్వీనర్‌గా నియామకం అయ్యారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో న్యాయ విద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా లా వింగ్ ఏర్పాటు చేశామని ఈ వింగ్ రాష్ట్రంలోని న్యాయ విద్యార్థుల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఐఎస్ఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి లెనిన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరంతో వ్యవసాయ కూలీ మృతి

ఓదెల, సెప్టెంబరు 2: మండలంలోని పొత్కపల్లికి చెందిన సిరిసేటి భాగ్యలక్ష్మి (60) అనే వ్యవసాయ కూలీ సోమవారం జ్వరంతో మృతి చెందింది. 15 రోజుల నుంచి జ్వరంతో ఉన్న భాగ్యలక్ష్మి విధిలేని పరిస్థితిలో ఆదివారం కూలిపనికి వెళ్లగా అక్కడ తీవ్ర అస్వస్థకు గురై కుప్ప కూలింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కోనరావుపేట, సెప్టెంబర్ 2 : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో పిచ్చికుక్క దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బడే ధృవన్, ఓదెల రమ్య, మోకాళ్ల లచ్చిరెడ్డిలు కిరాణా షాపునకు వచ్చి ఇంటికి వెళుతుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కాగా లింగంపల్లి రవికి చెందిన లేగ దూడపై పిచ్చికుక్క దాడి చేయగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ బాలుడు

మహిళా సంఘాల ధర్నా

● రూ.12.5 లక్షలు స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



కరీంనగర్‌లో నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 2: మహిళా సంఘాల గ్రూపులకు చెందిన రూ.12.50 లక్షలను ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేసిన ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు సోమవారం బల్దియా ఎదుట ధర్నా నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపు డబ్బులను వాడుకున్న ఆర్‌పీపై చర్యలు తీసుకొని బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌కు చెందిన గణేశ్ సమైఖ్య ఆధ్వర్యంలో దాదాపు 20 మహిళా స్వశక్తి గ్రూపులు ఉన్నాయన్నారు.

ఈ సమైఖ్యకు గాదం అరుణ ఆర్‌పీగా వ్యవహరిస్తున్నారన్నారు. బ్యాంకులో డబ్బులు వేస్తున్నాని చెప్పి 12 లక్షల 50వేల రూపాయలను స్వంతానికి ఆమె వాడుకున్నారని, గ్రూపు సభ్యులకు తెలియకుండా వారి సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరోపించారు. వెంటనే ఆమె నుంచి ఆ డబ్బులను రికవరీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపి ఆర్‌పీపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కమిషనర్ సువార్త, మెప్మా పీఆర్‌పి అనిత హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, నాయకురాళ్ళు పి.దేవేంద్ర, సమైకర్య అధ్యక్ష, కార్యదర్శులు కుంటా సుప్రజ, చంద్రకళ, పూనా నవ్య, కోశాధికారి తాడెం శ్రీలత, వంగల జ్యోతి, సభ్యులు పాల్గొన్నారు.

వర్షం.. నష్టం

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల నష్టం వాటిల్లింది. పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడంతో రోడ్లు కోతకు గురయ్యాయి. పంటలు నీట మునుగడంతో రైతులు నష్టపోయారు. చెరువుల నిండి కట్టలు తెగిపోయి రోడ్లకు గండ్లు పడ్డాయి.



కథలాపూర్ మండలం ఇప్పపల్లి వద్ద తెగిపోయిన వేములవాడ-కోరుట్ల రహదారి



మెట్‌పల్లి మండలం మాసాయిపేట శివారులో ధ్వంసమైన రహదారి



ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో కోతకు గురైన పొలం



గోదావరిఖనిలో నీటిలో చిక్కుకున్న లారీ



జగిత్యాల రూరల్‌లో అనంతారం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పెద్దపల్లిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చెక్‌డ్యాం తూము ధ్వంసం.. వృథాగా పోతున్న నీరు



సిరిసిల్ల చిన్నబోనాల శివారులో చెక్‌డ్యాం నుంచి వృథాగా పోతున్న నీరు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 2 : వర్షం నీటిని రక్షించాలనే సంకల్పంతో గత ప్రభుత్వాలు గుట్టల ప్రాంతాల్లో నీటి నిల్వల కోసం చెక్‌డ్యాంలను నిర్మించాయి. గుర్తుతెలియని వ్యక్తులు చెక్‌డ్యాంలను పగుల గొట్టడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెక్‌డ్యాంలో చేరిన నీరు వృథాగా పోతోంది. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల శివారులోని గుట్టల్లో ఉన్న కొత్తచెరువు దగ్గర 20 సంవత్సరాల క్రితం చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో నీటి నిల్వల కోసం ఈ చెక్‌డ్యాంను నిర్మించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అ స్థలాన్ని కబ్జాచేసి చెక్‌డ్యాం తూమును ధ్వంసం చేయడంతో నీరు వృథాగా పోతోందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, చెక్ డ్యాంను పరిశీలించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

లింగన్నపేట బ్రిడ్జి పరిస్థితిపై కలెక్టర్‌కు విన్నవించిన నాయకులు



సమస్యను వివరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

గంభీరావుపేట, సెప్టెంబరు 2: గంభీరావుపేట మండలం లింగన్నపేట మానేరు వాగు ఉధృతిని పరిశీలించేందుకు సోమవారం వచ్చిన కలెక్టర్‌కు కాంగ్రెస్, బీజేపీ నేతలు బ్రిడ్జి పరిస్థితిని విన్నవించారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం మొదలు కాకముందుకే పాత బ్రిడ్జిని కాంట్రాక్టర్ కూల్చివేశారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పాత బ్రిడ్జి కూల్చివేసి ఎవరికి తెలియకుండానే సలాకను అమ్ముకున్నారని పేర్కొన్నారు. వరద ప్రవాహం తగ్గితే పాత బ్రిడ్జి నుంచి యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగేవని, ఇప్పుడు పాత బ్రిడ్జి లేకపోవడంతో వరద నీటి ప్రవాహం తగ్గినా ఈ మార్గం గుండా రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందని వివరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్ తదితరులు ఉన్నారు

వాగు దాటి.. సమస్యలు విని

వీర్నపల్లి, సెప్టెంబర్ 2 : వర్షాల నేపథ్యంలో మారుమూల అటవీ తండాల సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామ పరిధిలోని కాశీ తండాకు దారి లేకపోవడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి వాగులో నుంచి నడుచుకుంటూ వెళ్లి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలకు ఇబ్బందులు తలెత్తితే సమాచారం అందించాలన్నారు. తండా వాసులు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వాగు దాటవద్దని సూచించారు.

కాలువను పరిశీలించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 2: గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ శివారులోని సింగ సముద్రం చెరువు నుంచి ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ జక్కుల చెరువుకు వచ్చే కాలువ పూడికతీత పనులు చేపట్టేందుకు నీటి పారుదల శాఖ ఏఈ భాస్కర్ రెడ్డి, ఆర్ఐ సంతోష్ కుమార్ సోమవారం పరిశీలించారు. సింగసముద్రం నుంచి జక్కుల చెరువుకు వచ్చే నీటి కోసం పనులను చేపట్టనున్నామని పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రైతులు ఉన్నారు.

లింగన్నపేట బ్రిడ్జిపై ఇంత నిర్లక్ష్యమా?



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

గంభీరావుపేట సెప్టెంబరు 2:: గంభీరావుపేట మండలం లింగన్నపేట హై లెవెల్ బ్రిడ్జిపై ఇంత నిర్లక్ష్యమా అంటూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి మండిపడ్డారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట మానేరు వాగు ఉధృతిని సోమవారం పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టక ముందే పాత వంతెనని కూల్చివేయడం అన్యాయమన్నారు. పాత బ్రిడ్జికి సంబంధించి కూల్చివేసిన సామగ్రికి అధికారుల అనుమతితో వేలం వేయాల్సి ఉండగా ఎవరికీ చెప్పకుండానే కాంట్రాక్టర్ అమ్ముకోవడమేంటని ప్రశ్నించారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వరద ఉధృతి తగ్గినా వాహనాలు వెళ్లని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించకుండా కాంట్రాక్టర్ పాత బ్రిడ్జిని కూల్చివేసి, కొత్త బ్రిడ్జిని నిర్మించకుండా రవాణా సౌకర్యం దూరం చేశారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధులు దివసాని కృష్ణ, ప్రసాద్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ, రాజు గౌడ్, రమేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 2: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రంతిరుపతిరెడ్డి సోమవారం బియ్యాన్ని పంపిణీ చేశారు. వల్లంపట్లకు చెందిన కొమురవ్వ, జవారిపేటకు చెందిన రామస్వామి, నర్సక్కపేటకు చెందిన కృష్ణహరి వివిధ కారణాలతో మృతిచెందారు. బోయిని రంజిత్, మధు, లక్ష్మణ్, అరుణ్, సుధీర్‌రెడ్డి, శేఖర్, అనీల్, రమేష్ పాల్గొన్నారు.

రైతు రుణాలపై స్పష్టత ఇవ్వాలి

కథలాపూర్, సెప్టెంబరు 2 : రైతులు తీసుకున్న రెండు లక్షల పైబిలు కు రుణాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని భూషణరావు పేట రైతులు నిరసన తెలిపారు. రేషన్ కార్డులు లేని రైతుల వివరాల నమోదుకు ఏఈవో శేఖర్ గ్రామ పంచాయతీకి రాగా నోటికి నల్లగుడ్డ కట్టుకొని వినతి పత్రం అందజేశారు. పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయలేని ప్రభుత్వం ఇక్కట్లకు గురి చేస్తోందని మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బద్దం మహేందర్, బద్దం మహిపాల్, గడ్డం దేవారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

వర్షం.. నష్టం

- ఉప్పొంగిన వాగులు.. నీట మునిగిన పంటలు
- ఎల్లారెడ్డి పేటలో దెబ్బతిన్న పంటలు
- వర్షానికి కూలిన ఇళ్లు
- ధ్వంసమైన రోడ్లు



రుద్రంగి మండలం మానాలలో కోతకు గురైన ఘాట్ రోడ్డు

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 2: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం వాగులు ఉప్పొంగాయి. వరద నీటికి పంటలు నీట మునిగాయి. మండల కేంద్రంతోపాటు దుమాల, అక్కపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, సింగారం, తిమ్మాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ తదితర గ్రామాల్లో వరి పంటలు కోతకు గురయ్యాయి. పత్తి పంటల్లో ఇసుక మేటలు వేసింది. పంట చేనుల్లోంచి వరద ప్రవహిస్తోంది. అక్కపల్లి, కోరుట్లపేట, నారాయణపూర్, పదిర గ్రామ శివారుల్లోని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు మత్తడి దూకుతున్నాయి. పదిర-రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య ఉన్న మానేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు సమీపంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం నీట మునిగింది. రాజన్నపేటలోని కుంట నిండడంతో స్థానికులు, రైతులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు గ్రామాల్లో 4 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మండల కేంద్రంలో పూర్తిగా నేలమట్టమైన సనుగుల లక్ష్మీకి వారం రోజులకు సరిపడ సరుకులను తహసీల్దార్ రామచంద్రం అందజేశారు. వాగులు, చెరువుల వద్ద భద్రత చర్యలు చేపట్టారు. తహసీల్దార్ రామచంద్రం, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచన వేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

● మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాత ఇళ్లు కూలిపోతున్నాయి. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో ఎస్సీ కాలనీ ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ఇళ్లు వర్షానికి పూర్తిగా తడిసిపోయాయి. కూలేందుకు సిద్ధంగా ఉండడంతో సోమవారం విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా ఆర్ఐ సంతోష్‌కుమార్ రావడంతో ఇద్దరు కలిసి ప్రమాదకరంగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఎస్సీ కాలనీకి చెందిన బత్తిని అశోక్ చెందిన ఇళ్లు కూలీపోగా అదే కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద మహిళ నర్మెట గాలవ్వ ఇళ్లు సైతం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఈ రెండు కుటుంబాలను అక్కడే ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లకు తరలించి పునరావాసం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోలాపూరం నర్సయ్య, వీరగోని శ్రీనివాస్‌గౌడ్ తదితరులుపాల్గొన్నారు.

ఇల్లంతకుంట: భారీవర్షాలతో మండలంలోని కందికట్కూర్‌కు చెందిన చెక్కిల్ల గంగవ్వకు చెందిన ఇల్లు నేలకూలింది. దీంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది. కందికట్కూర్‌లో ఇళ్లలోకి వరద నీరు వచ్చిచేరడంతో పలు కుటుంబాలు ఇబ్బంది పడినిట్లు గ్రామస్థులు తెలిపారు.

వేములవాడలో..

వేములవాడ రూరల్: గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మల్లారం, బొల్లారం, జయవరం వద్ద మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది . హన్మాజిపేట నక్కవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హన్మాజిపేట వద్ద నక్కవాగు ప్రవాహం ఎక్కువగా ఉందని రోడ్డు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షానికి కూలేరు పోచమ్మ అనే వృద్ధురాలు ఇల్లు కూలిపోగా అధికారులు నైబర్ ఇంటిలోకి తరలించారు. సందర్భంగా కార్యదర్శి ప్రదీప్ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇంటిలో ఉండద్దని గ్రామస్తులు ఏమైనా ఉంటే సమాచారం ఇవ్వాలని కోరారు.

రుద్రంగి: రుద్రంగి మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. రుద్రంగి మండలం మానాలలోని రుద్రంగి - మానాల రహదారిలో తాతమ్మ ఒర్రెపై వరద ఉధృతంగా ప్రవహించదంతో తారురోడ్డు కొట్టుకుపోయింది. దీంతో సోమవారం గ్రామస్థులు ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును చదును చేయించారు. మానాల ఘాట్‌రోడ్డులో చాలా చోట్ల రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రుద్రంగిలోని దసరానాయక్ తండాకు వెళ్లే రోడ్డులో కల్వర్టుకు బుంగలు పడడంతో సింగిల్ విండో డైరెక్టర్ కెసిరెడ్డి నర్సరెడ్డి సొంత ఖర్చులతో కల్వర్టుపైన బండరాళ్లను, మొరం మట్టి పోయించి చదును చేయించారు.



ఇళ్లను పరిశీలిస్తున్న అర్ఐ, కౌన్సిలర్



రోడ్డును చదును చేయిస్తున్న గ్రామస్థులు



బొల్లారంలో మత్తడి దూకుతున్న మూలవాగు

పొలాలకు వెళ్లడానికి దారి చూపండి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

వేములవాడ, సెప్టెంబరు 2 : పొలాల్లోకి వెళ్లడానికి దారి ఏర్పాటు చేయాలని పలువురు రైతులు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. వేములవాడ వైపు నుంచి మూలవాగు అవతలి వైపు ఉన్న తమ పొలాల్లోకి వెళ్లడానికి గతంలో దారి ఉండేదని, తమ పొలాలతో పాటు మారుపాక, సుద్దాల, మంగళపల్లి గ్రామాలకు వెళ్లడానికి సైతం గత వందేళ్ల నుంచి ఎడ్ల బండి బాట ఉన్నదని, కొంతకాలం కిందట మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ఈ దారిలో నుంచి వెళ్లకుండా చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మంజునాథ ఫంక్షన్ హాల్ పక్క నుంచి తాము పొలాల్లోకి వెళ్తున్నామని, వర్షాకాలం కావడంతో వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూలవాగులో కల్వర్టు నిర్మించి తమకు దారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

వేములవాడ, సెప్టెంబరు 2: ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా అక్షయపాత్ర లారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేశారు.

సర్పంచ్ ఎన్నికల బరిలో సీపీఐ అభ్యర్థులు

రుద్రంగి, సెప్టెంబరు 2: రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో సీపీఐ తరపున అన్ని గ్రామాల్లో అభ్యర్థులు బరిలో ఉంటారని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో సీపీఐ శాఖ కార్యదర్శుల సమావేశం, ఏఐటీయూసీ హమాలీ సంఘం సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పోటీలో ఉంటారన్నారు. లేబర్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం రంగంలో ఉన్న కార్మికుల మాదిరిగానే బెనిఫిట్స్ వర్తించే విధంగా ఉండాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో గణేష్, రాజేశ్వరి, మల్లేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, సెప్టెంబర్ 2:పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం లింగంపేటలో ఐసీడీఎస్ ఆధ్వ ర్యంలో సోమవారం పోషకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ నెల 30వరకు పోషకార వారోత్సవాలను నిర్వహించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ, సెప్టెంబరు 2: వేములవాడ పట్టణానికి చెందిన వడ్లకొండ సంతోష్ అనే యువకుడు క్యాన్సర్‌తో మృతి చెందగా విషయం తెలుసుకున్న విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. యువకుడి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేశ్, తోట రాజు, అబ్దుల్ రజాక్, మస్తాన్, కృష్ణ, నాగభూషణం శేఖర్, ఉమేందర్, రాజు ఉన్నారు.

వరద తగ్గగానే రోడ్డు మరమ్మతు చేపట్టాలి



రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 2: వరద ఉధృతి తగ్గగానే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. మండలంలోని జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్య వరద ఉధృతికి తెగిన రోడ్డు, కందికట్కూర్‌లో లోలెవల్ వంతెనలను ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీగా వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జవారిపేట రోడ్డు మరమ్మతు అయిన వెంటనే ఆర్టీసీ బస్సులు ప్రారంభించాలన్నారు. విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కందికట్కూర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలన్నారు. లోలెవల్ వంతెనల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్డీవో రమేష్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఇరిగేషన్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీవో మాజీద్, ఆర్ఐ షఫీ తదితరులు పాల్గన్నారు.

వరద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు



ఉదరవాగును పరిశీలిస్తున్న చైర్ పర్సన్, అధికారులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలో వరద నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను మున్సిపల్ చైర్ పర్సన్ కళాచక్రపాణి ఆదేశించారు మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట, పద్మానగర్, అశోక్‌నగర్, సంజీవయ్యనగర్ ప్రాంతాలతోపాటు ఉదరవాగు, ప్రధాన మురికి కాలువలు, తుమ్మలకుంట చెరువును, కాలువలను మున్సిపల్ చైర్ పర్సన్ కళాచక్రపాణి, కమిషనర్ మీర్జా ఫసహత్ బేగ్ అలీ, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని ప్రధాన మురికి కాలువ ద్వారా ప్రవహిస్తూ కొత్త చెరువు మీదుగా తుమ్మలకుంట చెరువుకు భారీగా వరద నీరు చేరుకోవడంతో తుమ్మల కుంట చెరువులో వరద నీరు నిలువలు పెరిగిపోతాయన్నారు. దీంతో సిరిసిల్ల పట్టణం వెంకంపేట, పద్మానగర్, శాంతినగర్, సంజీయ్యనగర్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నాయన్నారు. తుమ్మల చెరువుకు చేరుతున్న వరద నీటిని ఎస్ఆర్ఆర్ రిజర్వాయర్‌లోకి మళ్లించడం కోసం 9వ ప్యాకేజీ కాలువను, తుమ్మల కుంట చెరువును పరిశీలించామన్నారు. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను ప్రజలు, మున్సిపల్ సిబ్బంది శుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ డీఈ ప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు దిడ్డి మాధవి, గెంట్యాల శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎగువ మానేరులో గంగమ్మ తల్లికి పూజలు





నర్మలా ఎగువ మానేరు వద్ద పూజలు చేస్తున్న నాయకులు

గంభీరావుపేట, సెప్టెంబరు 2: గంభీరావుపేట మండలం నర్మల ఎగువ మానేరు ప్రాజెక్టును ముస్తాబాద్ కాంగ్రెస్ నాయకులు సోమవారం సంద ర్శించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు వచ్చిందని బీఆర్ఎస్ నాయ కులు ఆరోపించారని, ప్రకృతి కనికరించి సీఎం రేవంత్ రెడ్డి సర్కారును ఆశీర్వదించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టు నిండడంతో ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేటలో వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతా యన్నారు. మాజీ జడ్పీటీసీలు గుండం నర్సయ్య, మెరుగు యాదగిరిగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అంజన్ రావు, సురేందర్రావు సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కిషన్ రావు, డీటీ నరసింహులు, వేణు, మహేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎలసాని దేవయ్య యాదవ్, ప్రతాపరెడ్డి, శ్రీకాంత్, అంజిరెడ్డి, లింగంపల్లి మాజీ సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

● గంభీరావుపేట మండలం నర్మాల సమీపంలోని ఎగువ మానేరు జలాశయం మత్తడి ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో మానేరు జలాశయంను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కాంగ్రెస్ జిల్లా నాయకులు సోమవారం గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడే హమీద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మిరి శెట్టి తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి



చైర్ పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 2: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరిసిల్ల మున్సిల్ కార్యాలయంలో చైర్ పర్సన్ జిందం కళచక్రపాణి, అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గతంలో మున్సిపల్ సంబంధిత అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కొన్ని భవన నిర్మాణాలకు సంబంధించిన సమాచారం అడిగితే రికార్డులు లేవని అధికారులు సమాధానం ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు అన్నల్‌దాస్ గణేష్, సిరిసిల్ల మల్లేశం, ఎలిగేటి రాజశేఖర్ పాల్గొన్నారు.

పట్నాలకు టికెట్ కేటాయించాలి

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 2: వేములవాడ బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలో పట్నానికి టికెట్ కేటాయించాలని పట్టణానికి చెందిన భక్తుడు జంగిడి సంజీవ్ కోరారు. సోమవారం రాజన్న ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ బద్దిపోచమ్మ అమ్మవారికి పట్నం వేసి మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లగా బైండ్ల పూజారులు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ విషయంపై ఆలయ అధికారులను అడిగినా పట్టించుకోలేదని ఆరోపించారు. తమను అవమానించారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తూమును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

రుద్రంగి, సెప్టెంబరు 2: రుద్రంగి మండల కేంద్రంలోని నాగరం చెరువు తూము లీకవడంతో నీరు వృథాగా పోతుండడంతో సోమవారం ఇరిగేషన్ ఈఈ సంతూప్రకాష్ రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. నీరు వృథాగా పోతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కాంగ్రెస్ నాయకులు, రైతులు సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ అధికారులకు నాగరం చెరువు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ లీక్ కాకుండా తూముకు మర్మతు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, మల్లయ్య, సూర యాదయ్య, పూదరి మహిపాల్, ఎర్రం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



వేములవాడలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, సెప్టెంబర్ 2: మహానేత మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కొనియాడారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే రైతును రాజుగా చేశారని కొనియాడారు. మహిళలకు పావలా వడ్డీ, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, పేద ప్రజల కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. పదేళ్లలో అనేక రంగాల్లో వెనుకబడిన తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మి, వకులాభరణం శ్రీనివాస్, చిలుక రమేష్, తూమ్ మధు, పులి రాంబాబు, నిత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: ఉమ్మడి అంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సబ్బండ వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి తెలుగు జన హృదయాల్లో నిలిచారని టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలలు మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఉచిత కరెంట్‌పై తొలి సంతకం పెట్టి వ్యవసాయం దండగా అన్నవారికి పండగలా చేసి చూపారన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, మాజీ పీసీసీ సభ్యుడు నర్సయ్య మాజీ కౌన్సిలర్లు చంద్రకళ, ప్రభాకర్, లక్ష్మీనర్సయ్య, లక్ష్మిరాజం, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సోమవారం వైఎస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటి, సోషల్‌మీడియా కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు లింగాల భూపతి, మచ్చ శ్రీనివాస్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, బైరనేని రాము, జూపెల్లి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ కార్యాలయంలో రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, రాజేశం, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, బాబు పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలో వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో నందికమాన్ చౌరస్తా సమీపంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు కత్తి కనుకయ్య, పండుగు ప్రదీప్, ఊరడి రాంరెడ్డి, రవీందర్, ఆగయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, రమేష్ ఉన్నారు.

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, సోయినేని కరుణాకర్, జైపాల్‌రెడ్డి, రొండిరాజు,వంగపల్లి మల్లేశం, మానుపాటి పర్శరాం పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు చందనగిరి గోపాల్, మానుక సత్యం, రమేష్ రెడ్డి, దేవరకొండ చారి, గొట్టె శంకర్, భూమేష్, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ పొద్దుపొడుపు లింగారెడ్డి, నాగం కుమార్, నాయకులు భీమరాజు కనకరాజు, బండారు శేఖర్, గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, చెలుకల తిరుపతి, తర్రె లింగం, సూర యాదయ్య, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, స్వర్గం పరంధామ్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న నాయకులు